రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌:సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు..
టమోటా రూ.35, వంకాయ రూ.45, బెండ రూ.70, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.55, కాలిఫ్లవర్ రూ.28, క్యాబేజీ రూ.23, క్యారెట్ రూ.53, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.45, గోకరకాయ రూ.55, దోసకాయ రూ.40, సొరకాయ రూ17, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.105, చామగడ్డ రూ.37, మునగ రూ.50, చిలుకడ దుంప రూ.28, బీట్‌రూట్ రూ.35, కీర రూ.31, బీన్స్ రూ.115, క్యాప్సికమ్ రూ.75.ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నూతన కమిటీ ఏకగ్రీవం



కమిటీ సభ్యులను సత్కరించిన సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్‌: సైదాబాద్ డివిజన్ పరిధి రెడ్డిబస్తీలోని వీరాంజనేయ మందిరానికి నూతన కమిటీని ఏర్పాటు చేసామని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో రెడ్డిబస్తీ పెద్దల సూచనల ప్రకారం కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా నియమించామన్నారు. అధ్యక్షుడిగా నవారు సుధీర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కడారి రామ్‌కుమార్, మల్‌రెడ్డి సుధీర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామిరెడ్డి, కోశాధికారిగా శశికాంత్, కార్యదర్శులుగా వేదవ్రత్ గౌడ్, ప్రవీణ్, సహాయ కార్యదర్శులుగా చక్రవర్తి, అభిషేక్, సాంస్కృతిక కార్యదర్శులుగా శ్రీకాంత్, రేవంత్‌రెడ్డి నియమితులయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను సంరెడ్డి సురేందర్‌రెడ్డి శాలువాలు కప్పి సన్మానించారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న చిలుకూరి రామిరెడ్డి

సైదాబాద్‌: ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పెద్దమ్మ తల్లి ఆలయ ధర్మకర్త చిలుకూరి రామిరెడ్డి తెలిపారు. ఆదివారం శంకేశ్వరబజార్‌లోని ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కమిటీ సభ్యులతో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి పూజలకు భక్తులు సమర్పించిన చీరలను కార్మికులు, నిరుపేద మహిళలకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, అయ్యప్ప, రఘువీర్, వీరబద్రం పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



వినోద్‌కుమార్

నాగోలు: దీపావళి సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకునే బాణాసంచా దుకాణదారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకుని, నిబంధనలు పాటించాలని ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనావాసాల నడుమ బాణాసంచాల నిల్వ ఉంచితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీ ఫేజ్-2 కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సత్తయ్య, జాయింట్ సెక్రటరీగా రాహుల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చంద్రమోహన్, కోశాధికారిగా అంజన్‌రెడ్డి ఎన్నికయ్యారు.

కూర్చోవడానికి కుర్చీలు లేవు.. నిలబడేందుకు స్థలం లేదు!

చంపాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వసతుల లేమి

- రిజిస్ట్రేషన్‌కు వెళ్తే రోజంతా ఇబ్బందే..
- రోడ్లపైనే పడిగాపులు
- పట్టించుకోని అధికారులు



కార్యాలయంలో స్థలం లేకపోవడంతో కారిడార్‌లో ప్రమాదకరంగా కూర్చున్న దృశ్యం

చంపాపేట: ఇరుకైన పెచ్చులూడే పురాతన భవనం.. కనీసం తాగేందుకు మంచి నీటి సౌకర్యం లేదు.. రోడ్డు, కార్యాలయం కారిడార్ ముందే రిజిస్ట్రేషన్‌దారుల పడిగాపులతో పాటు రోడ్ల మీదనే వాహనాల పార్కింగ్ తదితర సమస్యలతో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు నరకానికి నిలువటద్దంగా మారాయి. కార్యాలయంలో కూర్చువడానికి కుర్చీలు లేవు, కనీసం నిలబడుదామంటే స్థలం లేకపోవడంతో రోడ్లమీదనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. అది చాలదన్నట్లు నెలలో రెండు మూడు రోజులు ఆన్‌లైన్ సర్వర్లు మొరాయించటం, రూ.10 మొదలుకొని రూ. 100 నాన్ జుడిషియల్ బాండ్ పేపర్లు కొరతతో రిజిస్ట్రేషన్‌దారుల తిప్పలు వర్ణనాతీతం.

రెండు దశాబ్దాలుగా..

చంపాపేట చౌరస్తా సమీపంలోని మౌలిక సమస్యలతో తాండవిస్తున్న ఓ పాత ఇరుకైన కిరాయి మెదటి అంతస్తు భవనంలో గత రెడు దశాబ్దాల క్రితం ప్రభుత్వ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయ పరిధిలో సరూర్‌నగర్, బాలాపూర్ మండల పరిధిలోని చంపాపేట, సుల్తానఅల్వా, తుమ్మలకుంట, బాలాపూర్, గుర్రంగూడ, కొత్తపేట, జల్‌పల్లి, మామిడిపల్లి, వెంకటాపూర్, నాదర్‌గూల్ వంటి పలు గ్రామ, నగర పంచాయితీల్లోని గ్రామాలు ఉన్నాయి. సహజంగా ఆయా గ్రామాల్లో రియల్ ఎస్టేట్ రంగంపై హైడ్రా ప్రభావం అంతగా లేకపోవటంతో ప్లాట్లు, కొత్త, పాత ఇళ్ల క్రయ, విక్రయాలు ఎక్కువగానే ఉంటున్నాయి. దీంతో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం నిత్యం రిజిస్ట్రేషన్‌కు వచ్చే సాక్షులు, క్రయవిక్రయదారులతో కిక్కిరిపోతోంది.

రోడ్లపైనే పార్కింగ్‌తో ట్రాఫిక్ జామ్..

కార్యాలయంలో మూడు ఇరుకైన గదులు, చిన్న వెయిటింగ్ హాల్ ఉండగా టాయ్‌లెట్స్, వాహన పార్కింగ్ సదుపాయలు లేకపోవడంతో అక్కడికొచ్చిన వారు నరకాన్ని చవిచూడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇక సర్వర్లు మొరాయిస్తే రద్దీతో ఊపిరాడని పరిస్థితి ఉంటుందని, కార్యాలయాన్ని వెంటనే విశాలమైన భవనంలోకి మార్చి, సర్వర్లు సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. నాన్ జుడిషియల్ బాండ్ల విక్రేత స్టాల్స్‌లో రూ. పది నుంచి రూ. 100 బాండ్ పేపర్లు అందుబాటులో లేకపోవటంతో అంతకంటే విలువైన బాండ్ పేపర్లు రెట్టింపు ధరలకు రిజిస్ట్రేషన్‌దారులకు అంటగట్టి జేబులు ఖాళీ చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాండ్ పేపర్ల కొరతను సృష్టించే డాక్యుమెంట్ రైటర్స్‌పై కఠిన చర్య తీసుకోవాలని రిజిస్ట్రేషన్‌దారులు కోరుతున్నారు. కార్యాలయానికి రిజిస్ట్రేషన్‌కు వచ్చే వారి వాహనాలు వందల సంఖ్యలో ఉంటుండటంతో ప్రధాన రహదారిపై పార్కింగ్ చేయటంతో నిత్యం చంపాపేట చౌరస్తాలో ట్రాఫిక్ జామై రోడ్డు ప్రమాదాలు చేసుకుంటున్నాయి.



కిక్కిరిసిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

మౌలిక వసతులు కల్పించాలి



కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం నిత్యం వందల సంఖ్యలో వస్తుంటారు. ఇరుకైన గదులలో సిబ్బంది విధులు నిర్వర్తించలేక రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా జరగటం లేదు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆఫీస్ ముందు, రహదారిపై పడిగాపులు కాయాల్సి వస్తుంది. పార్కింగ్ స్థలం లేదు.. కూర్చునేందుకు అవకాశమే లేదు. జేబును దండీగా తడిపే రియల్టర్లు నేరుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని వెళ్తున్నారు. మేము మాత్రం గంటల తరబడి పడిగాపులు కాయాలి.

–మంత్రి జగన్, నేతాజీనగర్

విశాలమైన భవనంలోకి మార్చాలి



గత రెండు దశాబ్దాలుగా ఇరుకైన పాత భవనంలోనే రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. రహదారులపై అక్రమ పార్కింగ్‌తో నిత్యం చంపాపేట చౌరస్తాలో ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది. ఉదయం సాయంత్రం వేళల్లో వంద గజాల చౌరస్తా ట్రాఫిక్‌ను దాటాలంటే ఊపిరి బిగపట్టుకుని పావుగంట ప్రయాణించాల్సిందే.కార్యాలయాన్ని వెంటనే మరో ప్రాంతానికి తరలించాలి.

– పి.శివకుమార్‌గౌడ్, కర్మన్‌ఘాట్

వ్యర్థాల వాహనం అడ్డగింత



వ్యర్థాలు తీసుకొచ్చిన వాహనం

పహాడీషరీఫ్‌: రాజేంద్రనగర్ నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకొచ్చి జల్‌పల్లి మున్సిపాలిటీలో పడేస్తున్న వాహనాన్ని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం అడ్డుకున్నారు. కొన్ని రోజులుగా కొందరు కంపెనీలలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకొచ్చి జల్‌పల్లి చెరువు ఒడ్డున కార్గో రోడ్డులో పడేస్తున్నారు. ఇక ఆదివారం కూడా కావడంతో మున్సిపల్ సిబ్బంది చూడరని భావించి బొలేరో ట్రాలీ డ్రైవర్ వ్యర్థాలు పారబోస్తుండడాన్ని గమనించిన 18వ వార్డు బీఆర్‌ఎస్ నాయకుడు గుండు నర్సింగ్ స్థానిక యువకులు శ్రీకాంత్, కృష్ణలతో కలిసి ఆటోను అడ్డగించి, మున్సిపల్ సూపర్‌వైజర్ బుదుమాల కుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న మున్సిపల్ సిబ్బంది ఆటోను మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ఇప్పటికే మున్సిపాలిటీలో ప్రజలు విషజ్వరాలతో బాధ పడుతుంటే అదనంగా బయటి ప్రాంతాల వ్యర్థాలను ఇక్కడ పడేయడం తగదని నర్సింగ్ మండిపడ్డారు. మున్సిపల్ సిబ్బంది ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు.

ఔషధ, సుగంధ మొక్కల సాగుపై శిక్షణ

బోడుప్పల్‌: బోడుప్పల్‌లోని కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన సంస్థ ఆవరణలో వచ్చేనెల 12, 14 తేదీల్లో నిమ్మగడ్డ, కాశగడ్డి, అశ్వగంధ తదితర ఔషధ, సుగంధ వాణిజ్య పంటల సాగు, ప్రాసెసింగ్, నాణ్యత, మార్కెటింగ్ అంశాలపై ఇంగ్లిష్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ చీఫ్ సైంటిస్ట్ జి.డి.కిరణ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. నమోదు రుసుం రూ. 3,500, నవంబరు 8వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్వయంగా శిక్షణకు హాజరుకావాలన్నారు. సమాచారం కోసం 9491043252,9493408227.

ఓటీఎస్‌కు విశేష స్పందన

చాదర్‌ఘాట్‌: నీటి బకాయిల పెండింగ్ బిల్లులకు సంబంధించి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌కు స్పందన వస్తోందని మలక్‌పేట జలమండలి డివిజన్-1 డీజీఎం హస్మత్‌అలీ తెలిపారు. మూసారాంబాగ్, అక్బర్‌బాగ్, సైదాబాద్ డివిజన్ల నుంచి ఓటీఎస్ ద్వారా దాదాపు రూ. 3.75 లక్షలు వసూలైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల చివరి వరకు అవకాశం ఉందని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్ దంపతులను సత్కరిస్తున్న కాలనీవాసులు

బోడుప్పల్‌: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేష్‌యాదవ్ అన్నారు. జ్యోతినగర్ కాలనీవాసులు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జ్యోతినగర్‌లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం పనిచేసినట్లు వివరించారు. రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ సమస్యలు, పార్కుల అభివృద్ధి, సీసీ కెమెరాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం కృషి చేసినట్లు తెలిపారు. అనంతరం కాలనీవాసులు కార్పొరేటర్ దంపతులను సత్కరించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఎల్‌బీనగర్‌: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఛత్రపతి శివాజీ గ్రౌండ్‌లో శ్రీకృష్ణ మెమోరియల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన తోటిరెడ్డి రితీష్ రెడ్డి మెమోరియల్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌ను కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కార్పొరేటర్ రూ. 5 వేలను బహుమతిగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, శరత్‌కుమార్, పవన్‌రెడ్డి, చిన్నయాదవ్, కౌశిక్, కిషోర్, భార్గవ్‌తేజ, అనిల్, రవి, ఓంప్రకాశ్, కార్తిక్‌నాయుడు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్‌లు ముందున్నాయి



సదస్సులో పాల్గొన్న క్లబ్ ప్రతినిధులు

వనస్థలిపురం: సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్‌లు ముందంజలో ఉన్నాయని క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ గుడిపల్లి రమేష్ అన్నారు. ఆదివారం వనస్థలిపురంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్లో జి.నరసింహులు, శ్యామసుందరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష్మీనరసింహ సేవా పురస్కార వైభవ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత నాలుగేళ్లుగా ఆయా క్లబ్‌లు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన సమీక్షించారు. సేవా కార్యక్రమాల్లో ముందున్న క్లబ్‌లను అభినందించి వారికి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విట్టా దూరయ్య, దొంతు పాండురంగయ్య, బాదం కళావతి, డి.వినయ సంతోష, చంద్రమౌళి గుప్తా, అల్లాడి పరమేశ్వర్, మద్ది శివనాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

దొంగల కోసం ముమ్మర గాలింపు

నాగోలు: మన్సూరాబాద్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలోని ఉమా నాగలింగేశ్వర స్వామి ఆలయం హుండీలోని నగదును దోచుకెళ్లిన వారి కోసం ఎల్‌బీనగర్ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దేవాలయంలోకి ప్రవేశించి హుండీ పగులగొట్టి నగదును చోరీ చేసిన విషయం తెలిసిందే. ఇదే తరహా మన్సూరాబాద్ పోచమ్మ దేవాలయంలోని హుండీని గతంలో చోరీ చేసి పట్టుబడ్డారు. దొంగల కోసం కాలనీలో సమీపంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. స్థానికంగా ఉండే జులాయిగా తిరిగే యువకులు మద్యం మత్తులో చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగ యువతులకు ఉచిత శిక్షణ

చైతన్యపురి: నిరుద్యోగ యువతులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు దిల్‌సుఖ్‌నగర్‌లోని నిర్మాణ్ ఆర్గనైజేషన్ బ్రాంచి మేనేజర్ చరణ్ తెలిపారు. సినాప్సిస్ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ఇచ్చే శిక్షణలో ఇంటర్ పాస్, డిగ్రీ ఫెయిల్ అయిన వారికి ఐటీఈఎస్ కోర్సు, డిగ్రీ పాస్, ఫెయిల్, బీ-టెక్ పాసైన వారికి వెబ్ డెవలప్‌మెంట్ కోర్సులు ఉంటాయని శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు.

అయ్యప్పలకు నిత్యాన్నదానం

వనస్థలిపురం:వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని షిరిడీ సాయిబాబా సంస్థాన్‌లో అయ్యప్ప మాలదారులకు మణికంఠ భిక్ష బృందం ఆధ్వర్యంలో చేపడుతున్న నిత్య అన్నప్రసాదాన్ని సద్వినియోగం చేసుకోవాలని బసవయ్య గురుస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎనిమిదేళ్లుగా దాతల సహకారంతో అయ్యప్ప స్వాముల కోసం నిత్య అన్నప్రసాద కార్యక్రమాన్ని 40 రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు నిట్టు కృష్ణ, పోచబోయిన కృష్ణ యాదవ్, సీహెచ్.జానకీరామ్, శంకర్‌రావు, భీమయ్య, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలకు సీజ్‌తో చెక్!

టౌన్ ప్లానింగ్ అధికారుల సరికొత్త ప్రయోగం



అనుమతి లేకుండా నిర్మించి ఓ భవనాన్ని ఇటీవల సీజ్‌చేసిన అధికారులు

ఎల్‌బీనగర్‌: జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ కట్టడాలపై సరికొత్త పంథాను అనుసరిస్తున్నారు. అనుమతులు లేని భవన నిర్మాణాలను కూల్చకుండా సీజ్ చేస్తూ కట్టడి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేస్తున్నారని పలు ఫిర్యాదులు అందడంతో అక్రమ నిర్మాణాలకు చెక్ పెట్టేందుకు సీజ్ మంత్రం ఉపయోగిస్తున్నారు. ఇలా చేస్తే అయినా అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు భావిస్తూ ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్-3 పరిధిలో ఇటీవల అక్రమ నిర్మాణాలపై అందిన ఫిర్యాదుపై అధికారులు వాటిని కూల్చకుండా సీజ్ చేయడంతో అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది.

సర్కిల్–3లో..

ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని నాగోలు, మన్సూరాబాద్, బీఎన్‌రెడ్డి, హయత్‌నగర్ డివిజన్లు ఉన్నాయి. ఈ డివిజన్లలో భూ సమస్య కారణంగా అధికారులు ఇక్కడ ఉన్న స్థలాలకు అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో ప్లాట్లు ఉన్నా భవనాలు నిర్మించుకోలేని స్థితిలో ఉన్నారు. అనుమతులు లేకపోయినా భవనాలను నిర్మిస్తున్నారు. ఈ తంతూ గత పదేళ్ల నుంచి కొనసాగుతోంది. అప్పట్లో అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు విఫలమవ్వడంతో ఎలాంటి అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తున్నారు. ఫిర్యాదులు వస్తే తూతూ మంత్రంగా కూల్చివేశారు. మరోపక్క రాజకీయ ఒత్తిడిలతో అధికారులు కూడా వెనక్కి తగ్గారు. ఇదే అదనుగా భావిస్తున్న అక్రమార్కులు 200 గజాల్లో ఏకంగా ఐదు అంతస్తులు నిర్మిస్తున్నారు.

అక్రమార్కుల్లో ఆందోళన..

ఇటీవల బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన పలు భవనాలను సీజ్ చేశారు. ఇలా సీజ్ చేయడంతో భవన నిర్మాణదారులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. సీజ్ చేయడంతో నిర్మించిన భవనంలో ఉండేందుకు వీలులేదు. అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఐదు భవనాలపై చర్యలు తీసుకున్నామని చర్యలు తీసుకోవాల్సినవి మరో 50 వరకు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. మరో రెండు వారాల్లో ఈ భవనాలపై చర్యలు ఉంటాయని టౌన్ ప్లానింగ్ అధికారులు పేర్కొడంతో ఆందోళన చెందుతున్నారు. సీజ్ మంత్రంతోనే ఇక నుంచి అక్రమ నిర్మాణాలు ఆగిపోతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు ఇప్పటికే గుర్తించామని ఈ భవనాలపై అనేక ఫిర్యాదులు కూడా వచ్చాయని టౌన్ ప్లానింగ్ అధికారి అక్బర్ పేర్కొన్నారు. త్వరలోనే అక్రమ నిర్మాణాలపై చర్యలు ఉంటాయన్నారు.

విద్యుత్ సమస్యలుంటే సంప్రదించండి

దిల్‌సుఖ్‌నగర్‌: విద్యుత్ సమస్యల పరిష్కారాల కోసం ఆయా ప్రాంతాల్లోని అధికారులను సంప్రదించాలని ఉన్నతాధికారులు సూచించారు.

- సరూర్‌నగర్ విద్యుత్ డివిజనల్ పరిధిలోని సరూర్‌నగర్, వీవీనగర్, కమలానగర్, హుడా కాంప్లెక్స్, పుష్పాగార్డెన్ ఎల్‌బీనగర్ మున్సిపాల్ కార్యాలయం సమీప కాలనీలు **9490153567, 9490153578** నెంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు.
- ఆర్‌కేపురం పరిధిలో.. ఆర్‌కేపురం, మోహన్‌నగర్, గ్రీన్‌హిల్స్‌కాలనీ, టెలిఫోన్‌కాలనీ, హరిపురి కాలనీ, అల్కాపురికాలనీలకు **9490153580, 9490153569.**
- ఎల్‌బీనగర్ సెక్షన్ పరిధిలో వేంకటేశ్వరాకాలనీ, శివపురికాలనీ, డాక్టర్స్‌కాలనీ, ఆర్టీసీ కాలనీ, సిరీస్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, శాతవాహననగర్‌కాలనీ, ఎన్‌టీఆర్‌నగర్, ఆర్‌ఆర్ జిల్లా కోర్టులకు చెందని కాలనీవాసులు **9490153571,9490153582** నంబర్లలో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్‌/రామంతాపూర్‌ : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నృత్య నాట్య గురువు రమేష్ దేవరకొండ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆహుతులను అలరించింది. కౌతం, జతిస్వరం, అన్నమయ్య సంకీర్తన, భామా కలాపం, పరులన్న మాట.-జావలి, బృందావన నిలయేహ్, భోశంభో తదితర అంశాలను పావని, పూర్ణిమ, వేదం, గాయత్రి, మహమ్మద్ అలీఫ్ లైలా, ప్రమీల, షాలిని తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న శశిధర్‌రెడ్డి

హస్తినాపురం: సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిదని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధి హస్తినాపురం కాలనీకి చెందిన వెంకటేశ్వర్లుకు మంజూరైన రూ.30 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం శశిధర్‌రెడ్డి అందజేశారు.